# సందేశం

ఎంత తెలివున్నా, చదువున్నా, డబ్బుంటే గానీ జరగదు జీవితం. 'ఎలాగైనా డబ్బు సంపాదిద్దాం' అని చూచాను లోకంలోకి. ఎవరిమట్టుకు వారే వెళ్ళిపోతున్నారెక్కడికో. పక్కనున్న వన్ను చూచీ చూడనట్టే పోతున్నారు. తల బాగా పైకెత్తి చూచాను లోకంలోకి. నాలాంటి వారెందరో చదువుకున్న పెద్ద వాళ్లు, చినిగిన చొక్కాలవాళ్ళు, మాసిన గడ్డాలవాళ్లు తల వంచుకొని ఏదో చేస్తున్నారు. "ఏమిటయ్యా చేసేది?" అన్నానొక మిత్రుణ్ణి. అతనే లోకంలో ఉన్నాడో, కదలేదు, మెదల్లేదు; కన్నెత్తి చూడలేదు. కదిలించినా కదలని మనిషి, పిలిచినా పలకని మనిషి, చచ్చినవాడితో సమానమే గా! ఏమిటి వాడు చేసేదని, అట్టే చూచాను; మరీ మరీ అడిగాను; "S వెయ్యాలా, M వెయ్యాలా" అన్నాడు. పెద్ద పెద్ద అక్షరాల్లో కనిపించాయి కమ్మని మాటలు: 'అంతా మీదే గెలవండి; రూపాయతో లక్షా యాభై వేలు; మీరే గెలవండి. అంతా మీదేనండి!' ఆహాహా! ఎంత తియ్యనిమాటలు! రసగుల్లా మామిడిపండులా, చక్కరకేళీ అరటి పండులా, ఎంతో తియ్యగా ఉన్నాయి. ఎవరో ఆ మహానుభావుడు? ఎందరో మహానుభావులు! ఉంటారు లోకంలో కొందరు; రూపాయకు లక్షా యాభై వేలిచ్చే దానకర్ణులుంటారు! భారత భాగవతాల్లో, రామాయణాది గ్రంథాల్లో, అటువంటి దానకర్ణుణ్ణే కనిపించలేదు నా కళ్లకు. ఎందుకు, అందరూ చేశారు దేశసేవ. సత్యాగ్రహ సమరాల్లో, విప్లవోద్యమాలలో, మంటలలో మాడి మసి, నుసి అయిపోయారు, మనుషులు మరిచిపోయారు వాళ్లని. ఏం లాభం! ఏం లాభం! వాళ్లు చచ్చి మాత్రం ఏం లాభం! పాపం ఈ మహానుభావు డెవ్వరో, దేవాంశ సంభూతుడు. రూపాయకు లక్షా యాభై వేలిస్తాడు. వంద సార్లు భుజంతట్టి లేపానొక మిత్రుణ్ణి. అతడు మేలుకొనే ఉన్నాడు. కాని నిద్ర పోతూ ఉన్నాడు. తాను నిద్రపోతూ ఉన్నాడో మేలుకొనే ఉన్నాడో, తనకే తెలియని స్థితిలో ఉన్నాడు. అయ్యో! ఏంచేసేది నేను! నా మిత్రుడు పిచ్చివాడైపోయాడా! "ఎందుకురా అలా చూస్తావ్!" అని దీనంగా అడిగాను. "S వెయ్యాలా, M వెయ్యాలా" అన్నాడు.

నేనూ కొంచెం ఆలోచించి "M వెయ్యరా సరిపోతుంది" అని అన్నానో ఇంకాలేదో! "కాదు అక్కడ S ఉండాలి" అని వంద మంది అరిచారు. "కాదు M ఉండాలి" అని లక్షగొంతులు అరిచాయి. "కాదు S ఉండాలి" అని పదిలక్షల గొంతులు. S కూ, M కూ మధ్య హోరాహోరీ పోరాటం. రక్తం చెమటగా మారిపోతూ ఉంది. నా మిత్రులు లక్షలు లక్షలు, నా మనోనేత్రం ముందు కనిపించారు. S కూ, M కూ B కి, D కీ జరిగే సమరంలో, అలిసిపోయి ఒరిగిపోతున్నారు. కట్టుకున్న గాలిమేడలు కూలిపోయి నిరాశతో కుంగిపోతున్నారు. మెదడంతా వేడికి కరిగి నీరై ప్రవహిస్తోంది. స్వార్థపరులు సృష్టించిన సుడిగుండంలో దూకి, నా మిత్రులు గిరగిర తిరుగుతూ, కొట్టుకొనిపోతూ, లక్షలు లక్షలొస్తాయని, కంటున్నారు కలలు.

## జి. సి. రామకృష్ణ

ప్రవాహంలో పడి దిక్కు తెలియక, కొట్టుకొనిపోతున్నారెక్కడికో. ధనంకోసం ఆశపడి, మనం మనుషులమని మరచిపోయి, పిచ్చివాళ్ళయిపోయే అమాయకపు మిత్రులారా! దరిద్రంతో నలిగిపోతూ, అద్దంలో కనిపించే ధనరాసులకోసం ఆశిస్తే ఏంలాభం ఏంలాభం! మీరు అద్దంలో డబ్బుమూట చూస్తూనే ఉంటారు. వెనకనే ఎవడో వచ్చి, డబ్బుమూట లాక్కుంటాడు. అద్దంలో మూటకూడా అదృశ్యమయి పోతుంది. నీకు మిగిలే దొక్కటే తెలుసుకో: అది నీ గాయపడిన హృదయమే. అంతకన్నా నీకేమీ మిగలదు. ఏ అక్షరం వేస్తే లక్షరూకలొస్తాయా అని, తపించే బదులు నీచుట్టూ ఇలా ఎందుకుందని, ఎన్నడైనా ఆలోచించావా? ఇదుగో నా సందేశం! నా చేయి నీకందిస్తున్నాను. సుడిగుండంలో కొట్టుకపోతూ, మునకే సుఖమనుకొన్నావా? బయటపడడం నీకిష్టం లేదా? నీవు మునగడం నా కిష్టంలేదు. మునిగితే బాపూజీలా, శ్రీరాములా, భగత్ సింగ్ లా మునగాలి. రూకలకోసం మునగలేదు వాళ్లు. లోకం యిలా ఎందుకుందన్నారు? మార్చి పారెయ్యాలన్నారు. మార్చడంలోనే మహానిర్యాణం చెందారు. అయ్యయ్యో! చావలేదు వాళ్ళు. ఇంకా మనలో ఉన్నారు, మనకోసం ఏడుస్తున్నారు. ఒక రూకతో పదిలక్షల రూకలు చెయ్యాలని కాదూ నీ దురాశ? డబ్బునే ప్రేమించే మనిషి మనుషుల్నెలా ప్రేమిస్తాడోయ్ భాయీ! నాకూ డబ్బంటే చాలా యిష్టం; కమ్మగా కాఫీ తాగొచ్చు; కడుపునిండా తినవచ్చు; నా పాపకు చొక్కా తేవచ్చు; ప్రియురాలితో సినిమా చూడొచ్చు, కానీ అక్షరాల గారడీలో నలిగి నలిగి సతమతమై, పొమ్మంటే మాత్రం, ఎదురు తిరుగుతాను నేను. చొక్కా మాసిపోతే ఏం, నా పాపడు దేవతలా ఉంటాడు. చీర చినిగిపోతే ఏం, నా ప్రేయసి నా కళ్ళకు ప్రకృతి యిచ్చిన బహుమానంలా, సౌందర్యదేవతలా కనిపిస్తుంది. నేను పోయే దారిలోనే రమ్మంటాను నావాళ్ళందర్నీ. కందుకూరి, గురజాడల అడుగు జాడల్లో, తడబడకుండా నడండి పోదాము. కందుకూరి కలం కత్తిలా మెరిసింది ఆనాడు. కత్తిఝళిపింపులకు జడిసి, అదిరిపోయారు దొంగలు. పాపం S వెయ్యాలా, M వెయ్యాలా అని ఆలోచించి, ఆలోచించి, అలిసిపోయావు పాపం! అందరం కలిసి ఆలోచిద్దాం. దిక్కులేని పసిపాపలు, 'అయ్యా కానీ బాబూ,' అని అడగనవసరంలేని సమాజం కోసం. దొంగలు సృష్టించిన యినుప చట్రంలో, నీవూ నేనూ, నలిగి నాశనమై పోకుండా, ఉండే భవిష్యత్తుకోసం ఆలోచిద్దాం రా. లోకం బాగుపడాలంటే, నీవూ నేనూ కదలాలి. మర్యాదస్తులు కదలరు మొదలు. మనకెందుకులే అని పోతుంటారు. అలాంటివాళ్లు లోకంలో ఉండీ ఒకటే, లేకా ఒకటేననుకో. సామాన్యుడి తలకు ఏదోపని కల్పించియిచ్చి, తలవంచి చెయ్యమని చెప్పడం, దొంగలకెప్పుడూ అలవాటే. నిన్న 'పజిల్' చేసి, వెర్రి వెంగళప్పను చేయడంకోసమే వచ్చాయి పజిల్స్. అక్షరాల గారడీమధ్య మన తెలివిని వృథా చేసేకన్నా అందరం కలిసి ఆలోచిస్తే, లక్షల చేతులు కలిశాయంటే, చెదలు పట్టిన సమాజాన్ని దుమ్ము దులిపి, చెదలు విదిపి, శుభ్రంగా చెయ్యొచ్చు. పాతమేడ విరిగిపోయి, పాడుబడిపోతుంటే చూస్తుంటే ఏం లాభం! పాత మేడను బాగైనా చేయాలి. లేక కొత్త మేడ కట్టాలనే కృషి అయినా చెయ్యాలి. కొత్త మేడంటే నాకూ యిష్టం. అందరం కలిశామంటే, అందమైన కొత్త మేడ కట్టుకోవచ్చు. అందరికీ సుఖం కలిగించొచ్చు. అక్షరాల గారడీలో పడి అమూల్యమైన బుద్ధిని వ్యర్థం చెయ్యకు. అక్షరాల వింతకంటే లక్షణంగా వినియోగించు. కళ్లు తెరిచి మేలుకొని సమాజాన్ని మార్చేందుకు ఆలోచించు, ఆలోచించు.

★